# ఆహార భద్రతాచట్టం పరిధి మరింత పెరగాలి!

'దేశంలో ఉన్న 80కోట్ల మంది పేదలకు వచ్చే ఐదేళ్ళ వరకూ ఉచిత ఆహార ధాన్యం అందించే ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన (పీఎంజీకేఏవై) పథకాన్ని పొడిగించాలని బీజేపీ ప్రభుత్వం తరపున నిర్ణయం తీసుకున్నాను. ఇదేమి రాజకీయ వాగ్దానం కాదు, మోదీ హామీ' అన్నారు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ఎన్నికల ప్రచార సభలో. అలా ఎంతో ముందుగానే ఓ ప్రకటన చేసి, తదనుగుణంగా తరువాత నిర్ణయం కూడా చేశారు. కీలకమైన ఈ అంశంపై రాజకీయ పార్టీల వైఖరి ఎలా ఉన్నా 'ఆహార భద్రత' రంగంలో పని చేస్తున్న సామాజిక సంస్థల అభిప్రాయం ముఖ్యం.

ఏప్రిల్ 2020లో కేంద్ర ప్రభుత్వం 'పీఎంజీకేఏవై' పథకాన్ని ప్రారంభించింది. కోవిడ్ మహమ్మారి కారణంగా ఏర్పడిన వివిధ ఆర్థిక అంతరాయాల కారణంగా పేదలు ఎదుర్కొంటున్న కష్టాలను తీర్చడం ఈ పథకం లక్ష్యం. అప్పటికే అమలులో ఉన్న 'ఆహార భద్రతా చట్టం 2013' ప్రకారం, బీపీఎల్ రేషన్ కార్డ్ ఉన్న ప్రతి వ్యక్తికి నెలకు ఐదు కిలోల ఆహార ధాన్యాలు హక్కుగా పొందే అవకాశం ఉంది. వారు కిలో బియ్యానికి రూ.3, గోధుమలకు రూ.2 చెల్లించాలి. 'పీఎంజీకేఏవై' క్రింద దానికి అదనంగా మరో 5 కిలోలు లబ్ధిదారులకు ఇస్తారు. ఈ అదనపు రేషన్‌కు ఎలాంటి రుసుమూ చెల్లించనక్కరలేదు. పీఎంజీకేఏవై పథకాన్ని కేవలం మూడు నెలల కోసం ప్రారంభించారు, తర్వాత పలుమార్లు పొడిగించారు. గత సంవత్సరం డిసెంబరులో కేంద్ర ప్రభుత్వం 'పీఎంజీకేఏవై'లో కీలక మార్పు తీసుకువచ్చింది. ఈ పథకాన్ని ఆహార భద్రతా చట్టంతో అనుసంధానం చేసింది. అంటే 'పీఎంజీకేఏవై'లో ఇస్తున్న అదనపు రేషన్ రద్దు చేసి ఆహార భద్రతా చట్టం రేషన్‌ను మాత్రం ఉచితం చేసింది. అంటే ఆహార భద్రతా చట్టంలో బియ్యానికి, గోధుమలకు తీసుకునే ఆ చిన్న మొత్తాన్ని రద్దు చేసి, దానినే 'పీఎంజీకేఏవై 2' అని అంటున్నారు. ఇది ఏడాది పాటు అమలు చేస్తున్నట్లు కేంద్రం ప్రకటించింది. దీనివలన ఆహార భద్రతా చట్టంలో జనవరి 2023 నుంచి డిసెంబరు 2023 వరకూ ఒక సంవత్సరం పాటు లబ్ధిదారులు ఉచిత ఆహారధాన్యాలను అందుకుంటారు. దీనికి సుమారు రూ.2 లక్షల కోట్ల రూపాయలు ఖర్చు అవుతుందని కేంద్రం అంచనా వేసింది. ఇప్పుడు ఐదేళ్ళపాటు పొడిగించింది ఈ 'పీఎంజీకేఏవై 2' పథకాన్నే.

అయితే, మొదటి దశలో అమలు చేసిన పీఎంజీకేఏవైని పొడిగిస్తే ఉపయోగం ఉంటుంది కానీ, రెండవ దశ పథకం 'పీఎంజీకేఏవై 2' పొడిగింపు వలన ప్రజలకు పెద్దగా ఒరిగింది ఏమీ లేదు. ఉదాహరణకు ఓపెన్ మార్కెట్‌లో కిలో బియ్యం ధర రూ.20 అనుకుంటే మొదటి దశ 'పీఎంజీకేఏవై'లో ఇచ్చిన అదనపు రేషన్ 5 కిలోలు ఆపేయడం వలన ఒక మనిషి నెలకు దాదాపు రూ.100 కోల్పోయారని అర్థం. ఇక రెండవ దశలో ఆహార భద్రతా చట్టం ఉచితం చేయడం వలన పేదలకు కలుగుతున్న ప్రయోజనం నెలకు రూ.10 నుంచి రూ.15 మాత్రమే. అంటే 'పీఎంజీకేఏవై 1' రద్దు వలన సంవత్సరానికి దేశ ప్రజలు దాదాపు రూ.86వేల కోట్ల సబ్సిడీ కోల్పోయారు.




ఆహార భద్రతా చట్టం విస్తృతిని పెంచాలి. దానికి 'పీఎంజీకేఏవై 2' పొడిగింపు సరిపోదు. ఉపాధి లేమి ఇమ్ముడిముబ్బడిగా పెరుగుతున్న నేటి సందర్భంలో ఆహార భద్రత మరింత సవాలుగా మారింది. కోవిడ్ కాలంలో కంటే ధరలు ఇప్పుడు మరింత పెరిగాయి. అలానే ప్రభుత్వాలు ఆహార భద్రత అంటే కేవలం బియ్యం/ గోధుమల అందుబాటుగా మాత్రమే చూస్తున్నాయి. మనం నిజంగా ఆహార భద్రత సమస్యను

పరిష్కరించాలని అనుకుంటే పోషకాహార భద్రతను నిర్ధారించడానికి, లోపాన్ని నివారించడానికి చర్యలు తీసుకోవాలి. ప్రొటీన్లు, విటమిన్లు, ఖనిజాలు, ఇతర సూక్ష్మపోషకాలు అధికంగా ఉండే పప్పులు, నూనెగింజలు, పండ్లు, కూరగాయలు, పాలు, గుడ్లు మొదలైన ఆహార పదార్థాలు ఆహార భద్రతా చట్టం పరిధిలోనికి తీసుకు రావాలి. అప్పుడు మాత్రమే భారతదేశం 'హంగర్ ఇండెక్స్' లో ప్రస్తుత 111 స్థానాన్ని మెరుగుపర్చుకోగలదు.

**మొదటి దశ 'పీఎంజీకేఏవై'లో ఇచ్చిన అదనపు రేషన్ 5 కిలోలు ఆపేయడం వలన ఒక మనిషి నెలకు దాదాపు రూ.100 కోల్పోయారని అర్థం. ఇక రెండవ దశలో ఆహార భద్రతా చట్టం ఉచితం చేయడం వలన పేదలకు కలుగుతున్న ప్రయోజనం నెలకు రూ.10 నుంచి రూ.15 మాత్రమే. అంటే 'పీఎంజీకేఏవై 1' రద్దు వలన సంవత్సరానికి దేశ ప్రజలు దాదాపు రూ.86 వేల కోట్ల సబ్సిడీ కోల్పోయారు.**

ఆహార భద్రతా చట్టం 2013 ప్రకారం దేశంలో 75 శాతం గ్రామీణ జనాభా, 50 శాతం పట్టణ జనాభాకు ఆహార ధాన్యాలు అందించాలి. 2011 జనగణన ఆధారంగా దేశవ్యాప్తంగా ఆహార భద్రతా చట్టం లబ్ధిదారులు 81.35 కోట్లు అని నిర్ధారించారు. తాజా జనాభా గణాంకాల ఆధారంగా లబ్ధిదారుల సంఖ్యను సవరించుకోవాలని చట్టం చెబుతోంది. కానీ 2021లో జరగాల్సిన జనగణన ఇప్పటివరకూ జరగనందున లబ్ధిదారుల సంఖ్య సవరించలేదు. సవరణ జరిగితే కనీసం మరో 10 కోట్ల మంది లబ్ధిదారులుగా అయ్యేవారని ఆహార భద్రతా అంశాలపై పని చేస్తున్న రైట్ టు ఫుడ్ కాంపెయిన్ సంస్థ అంచనా వేసింది. జనాభా పెరుగుదల, వలసలు, పట్టణీకరణ, కరోనా కారణంగా పేదరికంలోకి నెట్టివేయబడ్డ వారి సంఖ్య బాగా పెరిగింది. కానీ లబ్ధిదారుల సంఖ్యలో సవరణ జరగకపోవడం వలన వారెవ్వరూ ఆహార భద్రతా చట్టం నుంచి లబ్ధి పొందలేకపోతున్నారు.

అలాగే దేశంలో పేదల ఆహార భద్రతకు పొంచి ఉన్న ముప్పు ఒకటుంది. అది దేశ 'ఆహార సార్వభౌమత్వం' విషయంలో ఉదాసీనత. ఆకుపచ్చ విప్లవంతో ధాన్యం, గోధుమలు తదితర ఆహార ధాన్యాల ఉత్పత్తిని విస్తృతంగా పెంచడమే కాక పప్పు ధాన్యాలు, వంట నూనె తదితరాలలో స్వయం సమృద్ధి సాధించాం. కానీ డబ్ల్యూటీఓలో చేరడం, స్వేచ్ఛా వాణిజ్య విధానాలు అవలంబించడంతో ఇప్పుడు వీటిని దిగుమతి చేసుకోవడం ప్రారంభించాం. దానితో దేశ ఆహార సార్వభౌమత్వం దెబ్బతినే ప్రమాదం, తద్వారా భవిష్యత్తులో ఆహార భద్రతకు ముప్పు వాటిల్లే అవకాశం మెండుగా ఉంది. దీనిపై ప్రభుత్వం దృష్టి సారించాలి.

ఆహార భద్రతా చట్టం లబ్ధిదారుల సంఖ్యను తగ్గించాలని, అసలు దేశంలో 80కోట్ల మంది పేదలు లేరని అలాంటప్పుడు వేలాది కోట్లు ఖర్చు చేసి రేషన్ ఇవ్వడం సమంజసం కాదని కొంత మంది వాదిస్తుంటారు. ఈ వాదన నిజమనిపించినా లోతుగా పరిశీలిస్తే అసలు కథ అర్థం అవుతుంది. యూపీఏ 1 హయాంలో 'ఆహార భద్రతా చట్టం 2013' లబ్ధిదారుల సంఖ్య నిర్ణయించడానికి నేషనల్ శాంపిల్ సర్వే ఆఫీస్ (ఎన్ఎస్ఎస్ఓ) గణాంకాలను పరిగణలోకి తీసుకున్నారు. ఎన్ఎస్ఎస్ఓ 2009–10 గ్రామీణ ప్రాంతాలలో నెలవారీ తలసరి వ్యయం రూ.816, పట్టణ ప్రాంతాలకు తలసరి వ్యయం రూ.1000 కంటే తక్కువగా ఉన్నవారిని పేదవారిగా లెక్కించింది. ఆలా దేశంలో 80కోట్ల మంది పేదలుగా తేలేరు. అయితే భారతదేశ పేదరికం అంచనాలలో తీవ్రమైన లోపాలు ఉన్నాయి. పేదరికాన్ని అంచనా వేయడానికి ఉపయోగించే వినియోగ వ్యయ గణాంకాలలో విశ్వసనీయత లేకపోవడం, నిజమైన జీవన వ్యయాన్ని ప్రతిబింబించని ఏకపక్ష దారిద్ర్య రేఖలు వంటి సమస్యలతో పేదరిక డేటా దెబ్బతింది. అందువల్ల, ఆహార భద్రతా చట్టం పరిధిని విస్తరించడం అనేది పేదరికాన్ని అంచనా వేయడంలోని వైఫల్యాలకు ఆచరణాత్మక ప్రతిస్పందనగా భావించవచ్చు. ఇప్పుడు ఆహార హక్కును ప్రాథమిక మానవ హక్కుగా, రాజ్యాంగపు హక్కుగా నిలబెట్టే ప్రయత్నాలు కీలకం. అందుకోసం అందరూ నడుం బిగించాలి.